
తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
04-06-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 118
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice
వార్త పత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# ట్రస్ట్ ఏర్పాటే కాలే..

## మరి ఉద్యోగుల డబ్బులెక్కడున్నాయ్?!

- పదిలక్షల మంది మూలవేతనంలో 1.5 శాతం కోత
- హెల్త్ కేర్ పేరిట రూ.44కోట్లు కటింగ్
- మార్గదర్శకాలు, విధివిధానాలు లేకపోవడంపై ఉద్యోగుల మండిపాటు
- జూన్ 1 నుంచి నగదు రహిత సేవలు అన్నా క్షేత్రస్థాయిలో శూన్యం
- ఇప్పుడు ఆరోగ్యం చెడితే ఏ ఆస్పత్రికి వెళ్లాలి? అని ఉద్యోగుల ప్రశ్న
- భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒకరికే వర్తింపజేయాలంటూ డిమాండ్
- కేజీబీవీ, మోడల్ స్కూల్, కాంట్రాక్ట్ ఉద్యోగులకూ హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి
- డీఏలు, పెన్షన్ల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తూ.. కోతలపై శ్రద్ధ ఏంటని ఆగ్రహం









**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత ట్రస్ట్ ప్రారంభానికి ముందే తీవ్ర విమర్శల పాలవుతోంది. జూన్ 1వ తేదీ నుంచే ఉద్యోగులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత సేవలు అందించడానికి ఈ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని సాక్షాత్తూ ముఖ్యమంత్రే ప్రకటించారు. ఇందుకోసం ఉద్యోగుల మూలవేతనంలో 1.5 శాతం వాటా కట్ చేయడానికి, దానికి సమానంగా ప్రభుత్వం కూడా మరో 1.5 శాతం నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ విధానం ద్వారా ఉద్యోగులందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్నది ప్రభుత్వ మంచి సంకల్పమే అయినప్పటికీ.. అధికారుల అతివల్ల ఈ పథకానికి ఆదిలోనే గండిపడింది. ప్రకటన రాగానే మార్గదర్శకాలు విడుదల చేసి, ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. అసలు ట్రస్టే ఉనికిలోకి రాకముందే ఉద్యోగుల మే నెల జీతాల నుండి రికవరీ మొదలుపెట్టారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఏకంగా 44కోట్ల రూపాయలను వసూలు చేయడం ఇప్పుడు పెద్ద దుమారాన్ని రేపుతోంది.

**రూ.44కోట్లు ఎక్కడికెళ్లాయి?**
తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య భద్రత ట్రస్ట్ పేరిట మే నెల జీతం నుండి కట్ చేసిన ఈ రూ.44 కోట్లు ప్రస్తుతం ఎవరి ఖాతాలో ఉన్నాయనేది ఉద్యోగుల

మిగతా 2వ పేజీలో..

# రైజింగ్ కాదు..
# ఫాలింగ్ తెలంగాణ



- కాంగ్రెస్ హామీలు గాలిలో కలిశాయి
- రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టి కేసీఆర్‌పైనే దృష్టి
- తెలంగాణ అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- రైతులకు ముప్పు తెచ్చే నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..
2

## శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

- క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త విలువల నిర్ణయం
- ఈ నెల 5 నుంచి అమలు: – రెవెన్యూ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్:**
రాష్ట్రంలో భూముల విలువలను సవరించాలని, వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్నచోట్ల క్రమబద్ధీకరించాలని

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణలో పెట్టుబడులకు స్వాగతం

- దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ భేటీ
- వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యంపై చర్చలు
- పెట్టుబడిదారులకు అన్ని విధాల సహకారం అందిస్తామన్న సీఎం

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్:**
రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ షిపొకోసా మషటైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది.
ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..



## అమెరికాలో కారు ప్రమాదం !

- మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ దంపతులకు గాయాలు

**హైదరాబాద్, జూన్ 3 (సిరిన్యూస్):**
అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి సీనియర్ డాక్టర్ ఎండోక్రినాలజిస్ట్, సుచి యాష్కీ గాయపడ్డారు. మధుయాష్కీగౌడ్

మిగతా 3వ పేజీలో..



2

విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా చెక్కు



## 'కోర్' భూముల ధరలకు రెక్కలు

ఇప్పటికే రాయదుర్గం ఏరియా వేలంలో ఎకరాకు రూ.204కోట్లు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం

2



## ఆన్లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా...

- జూదం మౌలిక హక్కు కాదు..
- రమ్మీ...పోకర్ యాప్ లకు నో ఎంట్రీ..
- దేశవ్యాప్త నిషేధానికి దారి.. రాష్ట్రాలకే ఫుల్ పవర్స్..

**ఢిల్లీ, జూన్ 3 :**
ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన

మిగతా 3వ పేజీలో..

### పలు జిల్లాల్లో మోస్తరు నుండి
## భారీ వర్షాలు

- రాష్ట్రానికి వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్:**
రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో మోస్తరు నుండి

మిగతా 3వ పేజీలో..






## ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఈ ఏడాది వర్షపాతం తక్కువ నమోదయ్యే అవకాశం
- ఖరీఫ్ సాగు ప్రణాళిక సమావేశంలో మంత్రి తుమ్మల

**ఖమ్మం, జూన్ 3 , సిరి న్యూస్:**
వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా,

మిగతా 3వ పేజీలో..

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

- మనసుల్లో విభజన రేఖలు వద్దన్న పవన్ కల్యాణ్
- తెలంగాణలో అడుగుపెట్టనివ్వమనే వ్యాఖ్యలకే నా స్పందన
- కేటీఆర్‌తో సోదర సంబంధాలు ఉన్నాయని వెల్లడి
- రౌడీయిజానికి భయపడితే రాజకీయాలు చేయలేం
- మూడు రాజధానులు విఫలమై ఇప్పుడు మూడు జిల్లాలంటున్నారని ఎద్దేవా
- కుల, ప్రాంతీయ విద్వేష రాజకీయాలకు చరమాంకం పలకాలన్న జనసేన అధినేత

3



# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

- పవన్ కళ్యాణ్ మాకు నేర్పాల్సిన అవసరం లేదు!
- ఈ దేశంలో ఏ నాయకుడైనా పార్టీ పెట్టవచ్చు
- జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?
- దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ నేర్పాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. దేశంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉందని, ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ ఉందని చెప్పిన ఆయన.. ఏ ప్రాంతంలో రాజకీయాలు చేయాలనుకుంటే ఆ ప్రాంత చరిత్ర, పోరాటాలు, ప్రజల భావోద్వేగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో (2023) కూడా తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలోనో ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించాల్సిన అవసరం పవన్‌కు ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాంతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మద్రాస్ రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష కూడా ప్రాంతీయవాదమేనా?. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన పోరాటమే. దానిని తప్పుగా చిత్రీకరించడం సరికాదు. దేశభక్తి విషయంలో మాకు ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలు గుజరాత్‌కు వెళ్లిపోయాయి. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మేము మద్దతు ఇచ్చాము' అని కేటీఆర్ గుర్తు చేశారు. 'పవన్ కళ్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా గౌరవిస్తాం, నటుడిగా అభిమానిస్తాము. పవన్ ఇంటికి వస్తే బిర్యానీ పెట్టి మర్యాద చేస్తాం. కానీ మా సచివాలయంలో కూర్చొని తెలంగాణ గురించి తక్కువ చేసి మాట్లాడితే ఊరుకోం. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా చేశారు. తెలంగాణకు అసలైన ఓజీ కేసీఆర్. తెలంగాణ ఒక్క ఓజీ చాలు, ఇంకొకరు అసవరం లేదు. తెలంగాణ రాష్ట్రం సులభంగా వచ్చినది కాదు. వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ అయినా, మరెవరైనా దేశంలో ఎక్కడైనా పోటీ చేయవచ్చు. అయితే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిందే. ఖచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే. ఈ రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని ఎవరూ తక్కువ చేసి చూడలేరు' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

# రైజింగ్ కాదు.. ఫాలింగ్ తెలంగాణ

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్**

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

తెలంగాణ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో సాగిన గొప్ప ప్రజా పోరాటమని కేటీఆర్ అన్నారు. 1968 నుంచి ప్రారంభమైన ఉద్యమం అనేక దశల్లో కొనసాగిందని, వేలాది మంది యువకులు తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఉద్యమాన్ని అణచివేసిందని ఆరోపించారు.

2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారని, 2004లో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుందని తెలిపారు. పదేళ్లపాటు సాగిన ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు, యువకులు బలిదానాలు చేశారని, కేసీఆర్ పట్టుదల వల్లే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ సమాజం మొత్తం ఉద్యమంలో భాగస్వామ్యమైందని చెప్పారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ పథకాలు, వైద్య రంగంలో చేపట్టిన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు.

తెలంగాణ సాధించిన అభివృద్ధికి సమానంగా మరో రాష్ట్రం అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ లేదా బీజేపీ నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారం పూర్తిగా అసత్యమని అన్నారు.

అధికారం కోల్పోవడం తమకు బాధ కాదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న ఆకాంక్షలు నెరవేరకపోవడమే బాధ కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

"రైజింగ్ తెలంగాణ" అని చెబుతున్న కాంగ్రెస్ పాలన వాస్తవానికి "ఫాలింగ్ తెలంగాణ"గా మారిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరునే జపిస్తున్నారని ఆరోపించారు. భూముల వేలం ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలను ఎక్కడ ఖర్చు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

రైతుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. వ్యవసాయ విద్యుత్‌కు మీటర్లు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రైతు డిస్కం ఏర్పాటు ఆలోచన రైతులకు నష్టదాయకమని అన్నారు. వ్యవసాయ రంగానికి ముప్పు పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పోరాడితేనే తెలంగాణ వచ్చింది

- పవన్ వ్యాఖ్యలపై గద్దర్ తనయ వెన్నెల విమర్శలు

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్:**



తెలంగాణ అయ్య జాగీరా..? అంటూ జనసేన చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా ఖండించారు. పవన్ కల్యాణ్ కామెంట్స్ నేపథ్యంలో వెన్నెల మాట్లాడుతూ.. పవనన్న మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటారు. కానీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు రు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖచ్చితంగా ఖండిస్తున్నానన్నారు. తెలంగాణ సినిమాల్లో నటిస్తే రాలేదు.. తెలంగాణ పొత్తులకు పోతే రాలేదు. పైసలు పంచితే రాలేదు.. లాబీలు చేస్తే రాలేదు. తెలంగాణ పోరాటం ఓ సాయుధ పోరాటం. తమ రక్తం చిందించిన గడ్డగా నిలబడ్డ తెలంగాణ బిడ్డల త్యాగాల పోరాటం. తెలంగాణ ఒక ఆత్మగౌరవపోరాటం. ఎవరినీ ఒక్క బాధపెట్టుకుండా.. హింసించకుండా తమను తాము ఆహూతి చేసుకున్న శ్రీకాంతాచారే సాక్ష్యమన్నారు. తెలంగాణ పోరాటం ఒక సాంస్కృతిక యుద్ధం. పాటలతో మాటలతో ప్రజల్లోకి వెళ్లి.. గడపగడపకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసిన పోరాట గాథలున్న ఈ తెలంగాణ గడ్డ. మా భూములు మావి.. మా నీళ్లు మావి.. మా పాలన మాది అనే నినాదంతో ప్లలెప్లలె గడప గడప త్యాగాలు చేసి సాధించుకున్న పోరాట గడ్డ. తెలంగాణ మా అయ్యల జాగీరే, రేపు మా బిడ్డల జాగీరు కూడా అంటూ వెన్నెల వ్యాఖ్యానించారు.

# శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

**మొదటిపేజీ తరువాయి**

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు సవరించిన భూముల విలువలు ఈ నెల 5 నుంచి అమలులోకి వస్తాయని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా, అశాస్త్రీయ పద్ధతుల్లో 202122 సంవత్సరాల్లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు భూముల ధరలను పెంచడంతోపాటు రిజిస్ట్రేషన్ చార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందన్నారు. శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువల నిర్ణయం జరిగినట్లు తెలిపారు. వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి వెల్లడించారు.

గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను రూపొందించి ఆమోదించాయని చెప్పారు. ప్రాంతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవలి భూముల వేలాలు, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, వృద్ధి కారిడార్లు, ఔటర్, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విలువలను నిర్ణయించినట్లు తెలిపారు. ఫ్లాట్ల విషయంలో గతంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అంతస్తుల వారీగా అధిక రేట్లు నిర్ణయించడం వల్ల అసమానతలు ఏర్పడ్డాయని, అలాంటి చోట్ల అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించినట్లు వివరించారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదన్నారు.

అలాగే ప్రాంతాల అభివృద్ధి స్థాయినిబట్టి హెచ్ఎండీఏ, క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నిర్మాణ వ్యయాలను కూడా 2021 తర్వాత సవరించలేదని, గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ రేట్ల సవరణ అవసరమైందని పేర్కొన్నారు. అనేక మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సీసీ, నాన్‌ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సవరణలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూలావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు.

# తెలంగాణలో పెట్టుబడులకు స్వాగతం

**మొదటిపేజీ తరువాయి**

ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి ముఖ్యమంత్రి వివరించారు.

భారత్ అధికారిక పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన మషటైల్ బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మషటైల్ మాట్లాడుతూ తెలంగాణలో తమ ప్రతినిధి బృందానికి లభించిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాస్త్ర, సాంకేతిక, పెట్టుబడి సహకార రంగాల్లో తెలంగాణతో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నామని మషటైల్ పేర్కొన్నారు. భారత దేశంలోని అత్యంత యువ రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా తోడ్పడుతున్న రాష్ట్రంగా ఎదగడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రజల పట్టుదల, సృజనాత్మకత, సంకల్పమే ఈ విజయాలకు కారణమని కొనియాడారు.

భారత్-దక్షిణాఫ్రికా సంబంధాల చారిత్రక నేపథ్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. సాంకేతికత, ఔషధ రంగం, వ్యాక్సిన్లు, రక్షణ, అంతరిక్ష పరిశోధన, విద్య, ఆరోగ్యం, తయారీ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణ విశేష పురోగతి సాధించిందన్నారు.

గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్న మంత్రి, ద్వైపాక్షిక సంబంధాల విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

## విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా చెక్కు

**హైదరాబాద్, జూన్ 3**

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎస్పీడీసీఎల్ లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో బుధవారం అందజేశారు.

ఎస్పీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్‌గా పని చేసిన ప్రమోద్ కుమార్ 2025 మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎస్పీడీసీఎల్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం, USSA2, USSA3 శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు రూ.1 కోటి వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు.

ఈ పథకం కింద మృతుడి భార్య, నామినీ అయిన సోన్కాంబ్లే స్వప్న దాఖలు చేసిన క్లెయిమ్‌ను పరిశీలించిన బ్యాంకు అధికారులు రూ.1 కోటి బీమా మొత్తాన్ని మే 30న ఆమె ఖాతాలో జమ చేశారు. అనంతరం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమెకు బీమా చెక్కును అధికారికంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం, బ్యాంకింగ్ సంస్థల నిబద్ధతకు ఈ ఘటన నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంక్ సీఈవో అశిష్‌పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ట్రస్ట్ ఏర్పాటే కాలే..

**మొదటిపేజీ తరువాయి**

ప్రధాన ప్రశ్నగా మారింది. అసలు అధికారికంగా కమిటీ లేదా ట్రస్ట్ అనేది ఏర్పాటు కాకుండానే జీతాల్లో కోత ఎలా విధిస్తారని ఉద్యోగ సంఘాలు నిలదీస్తున్నాయి. 'మా జీతం నుండి డబ్బులు తీసుకున్నారు సరే.. మరి ఆ డబ్బులు ఎక్కడున్నట్టు? రేపటి సంగతి దేవుడెరుగు.. ఇవాళ రాత్రికి రాత్రి మాకు ఏదైనా ఆరోగ్య అత్యవసర పరిస్థితి వస్తే ఏ కార్పొరేట్ ఆస్పత్రి మాకు ఉచితంగా సేవలు అందిస్తుంది?' అని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుటుంబ నియంత్రణలు.. ఎన్నో అనుమానాలు**

ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ కొత్త ఆరోగ్య ట్రస్ట్ విధివిధానాలపై ఉద్యోగుల్లో ఎన్నో సందేహాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం వల్ల తక్కువ జీతం పొందే చిన్న ఉద్యోగుల కుటుంబాలలో తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి.. ఎక్కువ జీతం పొందే ఉన్నతాధికారుల కుటుంబాలలో ఎక్కువ ఖర్చుతో తక్కువ మందికి సేవలు అందేలా అసమతుల్యత ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా కుటుంబంలో ఉన్న పిల్లల వయస్సు 25 ఏళ్లు దాటితే ఈ పథకం కిందకు రారనే నిబంధన.. ఎక్కువ సర్వీస్ ఉన్న సీనియర్ ఉద్యోగులకు పెద్ద సమస్యగా మారింది.

**ఉద్యోగ సంఘాల డిమాండ్లు ఇవే**

- ఒకే కుటుంబంలో భార్యాభర్తలు ఉద్యోగులైనా లేదా పెన్షనర్లైనా ఉంటే.. వారిలో ఒకరి జీతం నుండి మాత్రమే ట్రస్ట్‌కు వాటా వసూలు చేయాలి.
- కుటుంబ పరిధిలోకి ఎవరెవరు వస్తారు (డిపెండెంట్లు) అనే విషయాన్ని ముందే స్పష్టం చేయాలి. వయస్సు పరిమితిని సవరించాలి.
- అత్యవసర పరిస్థితుల్లో పక్క రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆస్పత్రులలో కూడా తెలంగాణ ఈ.హెచ్.సి.టి కార్డులు చెల్లేలా చూడాలి.
- కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఎస్ఎస్ఏ, గురుకుల సొసైటీల ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కూడా వారి ఇష్టపూర్వకంగా ఈ కార్డులు జారీ చేయాలి.
- ఈ హెల్త్ కార్డులు అసలు వద్దు అనుకునే ఉద్యోగులకు 'ఆప్షన్' ఎంచుకునే వెసులుబాటు కల్పించాలి.
- చికిత్సకు సంబంధించిన నగదు పరిమితి (లిమిట్) లేకుండా 'అన్‌లిమిటెడ్' సేవలు అందించాలి. మెడికల్ రీఇంబర్స్‌మెంట్ విధానాన్ని కొనసాగించాలి.
- రిటైర్డ్ అయిన సీపీఎస్ ఉద్యోగుల ఇష్టపూర్వక వాటాను తీసుకుంటూ వారిని కూడా ఈ పథకంలో కొనసాగించాలి. వేతన వ్యత్యాసం లేకుండా స్లాబ్ సిస్టమ్‌ను తీసుకురావాలి.
- హెల్త్ కేర్ ట్రస్టు బోర్డులో వైద్య నిపుణులతో పాటు పెన్షనర్స్, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మెంబర్లను భాగస్వాములు చేయాలి. కేంద్ర ప్రభుత్వ సీజీహెచ్ఎస్ నార్మ్స్‌ను పరిగణనలోకి తీసుకోవాలి.

**వైద్యం ఎక్కడో ఇప్పటికి సమాచారం లేదు**

తెలంగాణ ఉద్యోగులకోసం ఏర్పాటు చేస్తామన్న ఆరోగ్య ట్రస్ట్ లో ఏయే ఆసుపత్రులు ఉన్నాయ్ . వాటిలో చికత్స గరిష్ట పరిమితి ఎంత, అన్ని వ్యాధులకు చికిత్స ఉంటుందా? అనే విషయంలోను స్పష్టత లేదు. ఏదైనా ఒక కార్యక్రమం ప్రారంభిస్తున్నపుడు సమగ్ర నివేదిక తయారు చేసి సంపూర్ణ విధి విధానాలతో ముందుకు వెళ్ళాలి కానీ ప్రభుత్వం ప్రకటిస్తున్న కొన్ని కార్యక్రమాలు ఇలా ఆరంభానికి
ముందే విమర్శలను ఎదుర్కోవడం సర్కారుకు కొంత మేర ఇబ్బందే అని చెప్పవచ్చు.

**కోతలపై ఉన్న శ్రద్ధ.. చెల్లింపులపై ఏది?**

ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలు, పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో ఏళ్ల తరబడి కాలయాపన చేసే ప్రభుత్వం.. ఇంకా బోర్డే ఏర్పడని హెల్త్ ట్రస్ట్ కోసం మాత్రం జీతాలు రాగానే కటింగ్స్ చేయడంపై ఉద్యోగ వర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇన్సూరెన్స్ అనేది పూర్తిగా వ్యాపారంగా మారిన ప్రస్తుత తరుణంలో.. తెలంగాణలో ఏర్పాటు చేయబోయే హెల్త్ కేర్ ట్రస్ట్ 'ఒకరి కోసం అందరం.. అందరి కోసం ఒకరు' అనే రీతిలో ఉద్యోగులందరికీ నిజమైన దిక్సూచిలా ఉపయోగపడాలే తప్ప.. ఇలాంటి తొందరపాటు కోతలతో అనుమానాలకు తావివ్వకూడదని ఉద్యోగులు హితవు పలుకుతున్నారు.

**సీఎస్ ఆధ్వర్యంలో కీలక నిర్ణయాలు**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో హెల్త్ కార్డ్ పథకంపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హెల్త్ స్కీమ్ నిర్వహణ కోసం మూడు రోజుల్లో ట్రస్ట్‌ను నియమించి, ఏడు రోజుల్లో రెఫరల్ ఆసుపత్రులు, చికిత్సల జాబితాతో కూడిన సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసి, పది రోజుల్లో ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్సను అందుబాటులోకి తీసుకువస్తామని సీఎస్ ప్రకటించారు. ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు జమ అయ్యే రోజే ప్రభుత్వ వాటాను ట్రస్ట్ ఖాతాలో జమ చేస్తామని, ఇప్పటికే ఈ నెల 10 నుంచి ప్రీమియం కటింగ్ ప్రారంభమైందని తెలిపారు. పాత ఈహెచ్ఎస్ జీవోలను పరిశీలించి దేశంలోనే అత్యుత్తమ స్కీమ్‌ను రూపొందిస్తామని, సీపీఎస్ ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత కూడా ముందస్తు చలానా ద్వారా చందా చెల్లించి ఈ పథకంలో కొనసాగే వెసులుబాటు కల్పిస్తామని స్పష్టం చేశారు.



## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్

- విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

**తెలంగాణ బ్యూరో , జూన్ 3:**

రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది

# 'కోర్' భూముల ధరలకు రెక్కలు

**తెలంగాణ బ్యూరో , జూన్ 3 , సిరి న్యూస్:**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయదుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములను సేకరించడం పెద్ద సవాలుగా మారింది. దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రైతులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. ఎకరాకు ఏకంగా రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.

**ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూసేకరణ**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గంలోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. మరోవైపు.. రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్ 1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్ 2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం 1500 ఎకరాల భూమిలో దాదాపు 300 ఎకరాలు అటవీ భూమి కాగా.. మరో 200 ఎకరాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి రవాణా కనెక్టివిటీ మరింత అద్భుతంగా మారనుంది.

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షా లు

మొదటిపేజీ తరువాయి

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రాణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**నేడు కేరళను తాకనున్న నైరుతి**

నైరుతి రుతుపవనాలు రాబోయే 24 గంటల్లో కేరళంలోకి ప్రవేశించ నున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తద్వారా క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించనున్నాయి. గురువారం నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ దుగా ఉత్తర తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్‌అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు.

ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు పాల్గొన్నారు.

# కోట్లు కొట్టాలనుకున్నాడు.. కటకటాలు చేరాడు

- **క్రికెట్ బెట్టింగ్‌లతో ఎదిగిన 'గోల్డ్ శేఖర్' ఆటకట్టించిన పోలీసులు**

**నరసరావుపేట, జూన్ 3 , సిరి న్యూస్:**

గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూ సాధారణ జీవితం గడిపిన వీరశేఖరాచారి, ఈజీ మనీ కోసం క్రికెట్ బెట్టింగ్‌ల బాట పట్టి చివరకు పోలీసులకు చిక్కాడు. నరసరావుపేటకు చెందిన వీరశేఖరాచారి అలియాస్ గోల్డ్ శేఖర్‌పై గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పలు కేసులు నమోదవగా, తాజాగా ట్రేడింగ్ పేరుతో మోసానికి పాల్పడిన కేసులో పల్నాడు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 15 ఏళ్ల క్రితం క్రికెట్ బెట్టింగ్‌లలో పంటర్‌గా అడుగుపెట్టిన వీరశేఖరాచారి, క్రమంగా బుకీగా మారాడు. బెట్టింగ్‌ల ద్వారా భారీ మొత్తంలో డబ్బులు సంపాదిస్తూ తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. పల్నాడు జిల్లాతో ప్రారంభమైన అతని కార్యకలాపాలు పక్క జిల్లాలకు విస్తరించాయి. అనుచరులను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున బెట్టింగ్‌లను నిర్వహిస్తూ క్రికెట్ బెట్టింగ్‌లలో కీలక వ్యక్తిగా ఎదిగాడు.

బెట్టింగ్ వ్యవహారాల్లో పలుమార్లు పోలీసులకు చిక్కిన వీరశేఖరాచారిపై గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో మూడు జిల్లాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ నిందితుడిగా మారాడు. అయినప్పటికీ తన కార్యకలాపాలను కొనసాగిస్తూ మరిన్ని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని విజయవాడకు చెందిన కళ్యాణ చక్రవర్తిని నమ్మించి రూ.1.44 కోట్లు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మొత్తాన్ని తన అనుచరుడు రవితేజ ఖాతాకు బదిలీ చేయించి, అక్కడి నుంచి రవితేజ భార్య లలిత ఖాతా ద్వారా చివరకు తన ఖాతాకు మళ్లించినట్లు విచారణలో తేలింది.

డబ్బులు తీసుకున్న తర్వాత స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన కళ్యాణచక్రవర్తి నరసరావుపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే సమయంలో క్రికెట్ బెట్టింగ్‌లపై పల్నాడు జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడంతో వీరశేఖరాచారి అజ్ఞాతంలోకి వెళ్లాడు.

పోలీసుల గాలింపుల్లో నంద్యాల జిల్లా మహానందిలో ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. వీరశేఖరాచారిపై మొత్తం 12 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీటిలో క్రికెట్ బెట్టింగ్ కేసులతో పాటు పోక్సో, మాదకద్రవ్యాల కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు.

ట్రేడింగ్ పేరుతో సేకరించిన డబ్బులను క్రికెట్ బెట్టింగ్‌లలో పెట్టుబడిగా పెట్టినట్లు దర్యాప్తులో బయటపడింది. పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మి ఎవరూ డబ్బులు పెట్టవద్దని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతున్నట్లు వెల్లడించారు

# ఆన్లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా...

మొదటిపేజీ తరువాయి



ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది...

**డబ్బులు పందెంపై..సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది**

ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

**సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి...**

ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**దేవరకొండ, జూన్ 3:**

డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారు పరిధిలోని కోదాడజడ్చర్ల జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో 136 పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి చిట్టేగొండ ఎల్లయ్య (35) గుంటూరు జిల్లా నుండి డీసీఎం వాహనంలో గొర్రెలను ఎక్కించుకొని మంగళవారం తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన మరో వాహనాన్ని గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టడంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. 136కు పైగా గొర్రెలు కూడా మృతిచెందాయి. డీసీఎం డ్రైవర్ రాము తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఫోన్ టాపింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 3:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్రపార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మ□డు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది

# అమెరికాలో కారు ప్రమాదం !

మొదటిపేజీ తరువాయి



చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కీని బోస్టన్ లోని హార్వర్డ్ యూనివర్సిటీ అనుబంధ హాస్పిటల్ లో ఎండీ కోర్సులో జాయిన్ చేసి తిరుగు ప్రయాణంలో న్యూయార్క్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వర్షం కారణంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచియాష్కీకి రిబ్స్ విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మధుయాష్కీగౌడ్ ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. డాక్టర్ గగన యాష్కీ న్యూయార్క్ మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, కాన్వొకేషన్ వేడుకకు హాజరయ్యేందుకు ఇటీవల మధుయాష్కీగౌడ్ అమెరికా వెళ్లారు. కుమార్తెను ఎండీ కోర్సులో జాయిన్ చేసే క్రమంలో లగేజీ ఎక్కువ ఉన్న క్రమంలో డాక్టర్ సూచి, మధుయాష్కీ వేర్వేరు కార్లలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా రేపు ఆయన ఇండియాకు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగింది.



# బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల జాబితా విడుదల

- **ఎంజేపీ ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు**

**హైదరాబాద్, జూన్ 3 , సిరి న్యూస్:**

మహాత్మా జ్యోతిబా పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 6, 7, 8, 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల రెండో జాబితాను బుధవారం విడుదల చేసినట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను సొసైటీ అధికారిక వెబ్ సైట్ • https://tgcet.cgg.gov.in/TGCETWEB/#/home , • https://mjptbcwreis.telangana.gov.in లో చూసుకో□వచ్చునన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారని, విద్యార్థులు ఏ తేదీన పాఠశాలకు హాజరు కావాలి అన్న వివరాలు తెలియ జేస్తారని తెలిపారు. మెరిట్ లిస్టులో ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీట్ల కేటాయింపు, భర్తీ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. బీసీ గురుకుల ఇంటర్ కోర్సుల్లో ఫస్ట్ లిస్టులో సీట్లు వచ్చిన విద్యార్థులు ఈనెల 4వ తేదీలోగా సంబంధిత కాలేజీలో రిపోర్టు చేయాలని డాక్టర్ మల్లయ్య తెలిపారు.

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

**అమరావతి, జూన్ 3 , సిరి న్యూస్:**

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణపై తనకు అపారమైన గౌరవం ఉందని, తెలంగాణ పూర్తిగా అక్కడి భూమిపుత్రుల జాగీరేనని స్పష్టం చేశారు. అయితే తెలంగాణలో తనను అడుగుపెట్టనివ్వమంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలకే తాను స్పందించానని తెలిపారు.

తెలంగాణ ప్రజలపై తనకు ఎలాంటి విరోధం లేదని, ప్రజా గాయకుడు గద్దర్ కూడా ఎప్పుడూ సంకుచిత ప్రాంతీయ భావజాలంతో మాట్లాడలేదని అన్నారు. భూమికి సరిహద్దులు గీయవచ్చని, కానీ మనసుల్లో గీసే విభజన రేఖలు సమాజాన్ని మరింత దూరం చేస్తాయని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం, అభివృద్ధి వంటి ప్రధాన సమస్యలను పక్కనబెట్టి కొందరు నేతలు కుల, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ తమ మధ్య సోదర సంబంధాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. కేటీఆర్‌తో తనకు పరస్పర గౌరవం, స్నేహం ఉన్నాయని, ఆయన తనపై తప్పుగా మాట్లాడి ఉంటారని అనుకోవడం లేదన్నారు. తెలంగాణలో కాంట్రాక్టుల అంశాన్ని లేవనెత్తుతున్న నేతలు గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఎన్ని కాంట్రాక్టులు పొందారో లెక్కలు తీయాలని సూచించారు. తెలంగాణలో జనసేన పార్టీ పోటీ చేస్తే స్థానిక నాయకులే బరిలో ఉంటారని, ఇతర రాష్ట్రాల నాయకులను తీసుకురాబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు సభలు నిర్వహించుకోవడం సహజమని, వాటిని అడ్డుకోవడం సరికాదన్నారు.

రాజకీయ సభలను అడ్డుకోవడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రౌడీయిజానికి భయపడే వారు రాజకీయాల్లో ఉండరని, ఎన్నో కష్టాలు పడి జనసేన ఈ స్థాయికి చేరుకుందని చెప్పారు. తెలంగాణలో కూడా ప్రజల కోసం పార్టీ కేడర్ పనిచేస్తుందని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన "మావిగాన్" అంశంపై పవన్ కల్యాణ్ విమర్శలు చేశారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చి విఫలమయ్యారని, ఇప్పుడు కొత్త పేర్లతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల్లో తెలంగాణ భావన, తమిళనాడులో తమిళ అస్తిత్వం బలంగా ఉన్నాయని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ఒకే ఆంధ్ర భావన బలపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో రాజకీయ వ్యవస్థ దిగజారిపోయిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. కులాల పేరుతో దూషణలు చేయడం, ప్రజలను వర్గాలుగా విభజించడం రాజకీయ సంస్కృతిగా మారిందన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కుల, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. సమాజంలో విభజనకు దారితీసే ఇలాంటి రాజకీయాలకు చరమాంకం పలకాలనే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు

# డ్రగ్స్ మహమ్మారికి చెక్ పెట్టాలి

- కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో ప్రత్యేక నిఘా అవసరం
- సీపీ రమేష్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- త్వరలో అవగాహన సదస్సులు, సంయుక్త కార్యాచరణకు శ్రీకారం: సీపీ



**రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 4 (సిరి న్యూస్):**

కొల్లూరు, ఉస్మాన్‌నగర్, నాగులపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి యువత భవిష్యత్తును కాపాడేందుకు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డిని కోరారు.బుధవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు పెరుగుతున్నాయని వివరించారు. ముఖ్యంగా కొల్లూరు, ఉస్మాన్‌నగర్, నాగులపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతోందని పేర్కొన్నారు.తెలంగాణలో నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ కాలనీలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. డ్రగ్స్ బారిన పడుతున్న యువత ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా నష్టపోవడంతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, కాలనీల్లో నిరంతర పర్యవేక్షణతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాప్రతినిధులు, పోలీసులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలను భాగస్వామ్యం చేస్తూ సంయుక్త కార్యాచరణ చేపట్టాలని కోరారు.దీనిపై స్పందించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు ఇప్పటికే పలు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కాలనీల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అక్రమంగా మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు, పోలీసులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నైపుణ్యాభివృద్ధికి గీతం పెద్దపీట..

## సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు స్పష్టమైన మార్గదర్శనం

## కెరీర్ నిర్మాణానికి వినూత్న 'పాత్ వేస్' ప్రారంభించిన గీతం

**రామచంద్రపురం,(పటాన్ చెరు), జూన్ 4 (సిరి న్యూస్):**

GITAM
DEEMED TO BE UNIVERSITY

వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు సరైన కెరీర్ దిశను ఎంచుకుని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే లక్ష్యంతో గీతం విశ్వవిద్యాలయం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, ట్రైనింగ్, మెంటరింగ్ అండ్ కెరీర్ గైడెన్స్ (టీఎంసీజీ) ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం సమగ్ర కెరీర్ మార్గ సూచీల (Career Pathways) శ్రేణిని అందుబాటులోకి తీసుకొచ్చింది.టీఎంసీజీ డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ నేతృత్వంలో రూపొందించిన ఈ కార్యక్రమం విద్యార్థులు తమ అభిరుచులు, సామర్థ్యాలకు అనుగుణంగా సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకునేందుకు దోహదపడనుంది. ప్రాథమిక స్థాయి నుంచి పరిశ్రమకు సిద్ధమైన నిపుణులుగా ఎదిగే వరకు విద్యార్థులకు అవసరమైన అభ్యాస మార్గదర్శకాలు ఇందులో పొందుపరిచారు.ప్రస్తుతం కృత్రిమ మేధ (AI), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT), ఎంబెడెడ్ సిస్టమ్స్, బ్లాక్‌చైన్, వీఎల్ఎస్ఐ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు తమ కెరీర్‌ను ఎలా మలుచుకోవాలనే అంశంలో అనేక సందేహాలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రూపొందించిన కెరీర్ పాత్‌వేస్ విద్యార్థులకు స్పష్టమైన దిశానిర్దేశంతో పాటు ఆచరణాత్మక అభ్యాస ప్రణాళికను అందించనున్నాయి.ఈ సందర్భంగా డాక్టర్ రోజీనా మాథ్యూ మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో విజయవంతమైన కెరీర్‌కు నిరంతర అభ్యాసం, నైపుణ్యాల నవీకరణ ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు ఏమి నేర్చుకోవాలి, ఎప్పుడు నేర్చుకోవాలి, ప్రాథమిక స్థాయి నుంచి నిపుణుల స్థాయికి ఎలా చేరుకోవాలి అనే అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గ సూచీలను రూపొందించినట్లు తెలిపారు.పరిశ్రమ పోకడలు, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా ఈ మార్గదర్శకాలను నిరంతరం నవీకరిస్తామని, భవిష్యత్తులో సాంకేతికేతర రంగాలకు సంబంధించిన కెరీర్ మార్గ సూచీలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, మెంటార్‌షిప్, వృత్తిపరమైన మార్గదర్శనం అందిస్తూ భవిష్యత్ అవసరాలకు తగిన నిపుణులను తీర్చిదిద్దడంలో గీతం తన నిబద్ధతను మరోసారి చాటిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు."ప్రారంభించడానికి ఉత్తమ సమయం నిన్న... రెండో ఉత్తమ సమయం ఇప్పుడే" అనే సందేశంతో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పిస్తూ, "అన్వేషించండి... నేర్చుకోండి... నిర్మించండి... ఎదగండి" అనే లక్ష్యంతో గీతం చేపట్టిన ఈ కార్యక్రమం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది.

# గడ్డపోతారు మున్సిపల్ కమిషనర్గా పి.తాన్య బాధ్యతల స్వీకరణ...

## ప్రజా సమస్య పరిష్కారమే నా తొలి ప్రాధాన్యం

**జిన్నారం జూన్ 3 సిరి న్యూస్**

గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ గా పి.తాన్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించిన వెంకటరామయ్య బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో ప్రభుత్వం పి.తాన్యను నియమించింది.

**ఘన స్వాగతం:**

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ కు మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు. కమిషనర్ స్పందన బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కమిషనర్ మాట్లాడుతూ గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు పారిశుద్ధ్యం వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డుల వారీగా ఉన్న సమస్యలను త్వరి తగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని ఆమె పేర్కొన్నారు.

## సంపాదకీయం

# స్వరాష్ట్ర స్వప్నాలు...పాక్షికమే !

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి 12 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా లేదా అనే ప్రశ్నపై భిన్నమైన రాజకీయ, సామాజిక దృక్పథాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోయి స్వరాష్ట్రంగా అవతరించిన నాటి నుంచి నేటి వరకు జరిగిన ప్రగతిపై సాధ్యాసాధ్యాల విషయంలో సమతుల్యత లేదనే చెప్పాలి. తెలంగాణ సమాజం ఆరు దశాబ్దాల పాటు సాగించిన సుదీర్ఘ పోరాటం, వందలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా స్వరాష్ట్ర స్వప్నం సాకారమైంది. నాటి ఉద్యమానికి ప్రధాన నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు, "ఆత్మగౌరవం" అనే పునాదులపైనే నూతన తెలంగాణ నిర్మాణం ప్రారంభమైంది. సాగునీరు, తాగునీటి రంగాలలో గత దశాబ్ద కాలంలో తెలంగాణ ఊహించని ప్రగతిని సాధించింది. ఒకప్పుడు కరువుతో అల్లాడిన ప్రాంతాలు నేడు పచ్చని పంట పొలాలుగా మారాయి. సొంత నిధుల వినియోగం పెరగడంతో రాష్ట్ర బడ్జెట్ పరిమాణం పెరిగింది. హైదరాబాద్ కేంద్రంగా ఐటీ, ఫార్మా రంగాలు విస్తరించి, దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. ఉచిత విద్యుత్, రైతు సంక్షేమ పథకాలు, మహిళల సాధికారత,




ఇందిరమ్మ ఇళ్లు వంటి సామాజిక భద్రతా పథకాలు క్షేత్రస్థాయికి చేరుకున్నాయి. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇంకా ఆశించిన స్థాయిలో వేగవంతం కాలేదనే అసంతృప్తి యువతలో ఉంది. పేపర్ లీకేజీలు, కోర్టు కేసులు, నోటిఫికేషన్ల ఆలస్యం నిరుద్యోగుల ఆకాంక్షలకు పెద్ద అడ్డంకిగా మారాయి.

**ఆర్థిక భారం... అప్పులు**

రాష్ట్రాభివృద్ధి జరిగినప్పటికీ, పెరిగిన అప్పుల భారం భవిష్యత్తు ఆర్థిక ప్రగతికి సవాలుగా నిలుస్తోంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణను దేశానికే దిక్సూచిగా మార్చామని చెప్తుండగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలనలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, తామే ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తున్నామని వాదిస్తోంది. మౌలిక వసతుల కల్పన, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు కోసం చేసిన అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారాయి. బడ్జెట్‌లో సింహభాగం వడ్డీలు కట్టడానికే సరిపోతోంది. ఐటీ రంగంలో ప్రైవేట్ ఉద్యోగాలు లభిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జరిగిన ఆలస్యం, పేపర్ లీకేజీల వివాదాలు యువతలో ఇప్పటికీ అసంతృప్తిని మిగిల్చాయి. ప్రభుత్వ రంగంలో ఉస్మానియా, గాంధీ వంటి ఆసుపత్రులు, నిమ్స్ విస్తరణ జరుగుతున్నా... క్షేత్రస్థాయిలో పేద ప్రజలు వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులపాలు కావడం ఇంకా పూర్తిగా తప్పలేదు. సమగ్రంగా విశ్లేషిస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు "పాక్షికంగా నెరవేరాయి, కానీ సంపూర్ణ లక్ష్యాన్ని చేరడానికి ఇంకా ప్రయాణించాల్సి ఉంది". భౌగోళికంగా, ఆర్థికంగా తెలంగాణ అద్భుతమైన వృద్ధిని సాధించిన మాట వాస్తవమే అయినా... ఉద్యమకారులు ఆశించిన సామాజిక తెలంగాణ, "నిరుద్యోగ రహిత సమాజం" ఏర్పడినప్పుడే అమరవీరుల ఆత్మలకు నిజమైన శాంతి లభిస్తుంది.

# పంట అవశేషాల దహనం.. పర్యావరణానికి పెను ముప్పు.

- భూసారం కోల్పోతున్న రైతన్న..
- కాలుష్యంతో ప్రజారోగ్యంపై ప్రభావం.
- పంట అవశేషాల దహనంతో భూసారం తగ్గిపోతోంది
- సేంద్రియ కార్బన్, పోషకాలు పూర్తిగా నశిస్తున్నాయి
- వాయు కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై ప్రభావం
- శ్వాసకోశ వ్యాధుల ముప్పు పెరుగుతోంది
- మంటలు ఇతర పొలాలకు వ్యాపించే ప్రమాదం
- రైతుల సాగు వ్యయం పెరిగే అవకాశం
- ప్రత్యామ్నాయ పద్ధతులపై అవగాహన అవసరం
- పర్యావరణ పరిరక్షణకు అవశేషాల దహనాన్ని నివారించాలి.

**రామాయంపేట, జూన్ 3 (సిరి న్యూస్)**

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పెరుగుతున్న కొద్దీ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే అవశేషాల నిర్వహణ రైతులకు సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో రైతులు వరి, మొక్కజొన్న తదితర పంటల అవశేషాలను తగులబెట్టే పద్ధతిని అనుసరిస్తున్నారు.ఇటీవల



మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామ శివారులో ఒక రైతు బాధ్యతారాహిత్యం వల్లవరి కొయ్య కాలు తగుల పెట్టడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు మంటలు విస్తరించడంతో.. గడ్డి వాములు, పశువుల కొట్టం, ఐదు రోజుల దొడ్డే సజీవ దహనం అయ్యాయి.ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. వరి కొయ్య కాలు తగులు పెట్టడం తాత్కాలికంగా సౌలభ్యంగా కనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో వ్యవసాయ భూముల ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతోందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇటీవల రామాయంపేట ఉమ్మడి మండలంలో ఉన్న పలు పొలాల్లో పంట అవశేషాలకు నిప్పంటించిన ఘటనలు వెలుగుచూశాయి. పెద్ద ఎత్తున ఎగసిపడుతున్న పొగ స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, పర్యావరణ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. పొలాల్లోని అవశేషాలను దహనం చేయడం వల్ల భూమిలో సహజంగా ఉండే సేంద్రియ కార్బన్, నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాలు నశించి, భూసారం క్రమంగా తగ్గిపోతుంది.వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రకారం ఒక ఎకరం పొలంలో పంట అవశేషాలను కాల్చడం ద్వారా వేల రూపాయల విలువైన పోషకాలు బూడిదవుతున్నాయి. దీంతో రైతులు తదుపరి పంట కోసం అధిక మొత్తంలో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తోంది. ఇది సాగు వ్యయాన్ని పెంచడమే కాకుండా, భూమి సహజ సంతులనాన్ని దెబ్బతీస్తోంది.మరోవైపు పంట అవశేషాల దహనం వల్ల విడుదలయ్యే కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సూక్ష్మ ధూళి కణాలు వాతావరణంలో కలిసిపోవడంతో గాలి నాణ్యత దెబ్బతింటోంది. చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది మరింత ప్రమాదకరంగా మారుతోంది.అదేవిధంగా పొలాల్లో అంటించిన మంటలు కొన్నిసార్లు అదుపుతప్పి సమీపంలోని తోటలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, గడ్డి మేటలు, పశువుల షెడ్లకు వ్యాపించే ప్రమాదం కూడా ఉంది. ప్రస్తుత వేసవి కాలంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.పంట అవశేషాలను కాల్చివేయకుండా, వాటిని యంత్రాల సహాయంతో భూమిలో కలపడం, పశుగ్రాసంగా వినియోగించడం లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం ద్వారా రైతులు అదనపు ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములను అందించాలంటే పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# కాలం పాతికేళ్లు దాటిన చెదరని స్నేహం..

- బడి జ్ఞాపకాల పల్లె కోయిలలు
- పాతికేళ్ల తర్వాత ఒకే వేదికపై
- మురిసిన జిన్నారం బడి తోట
- మళ్లీ విరిసిన బాల్య స్నేహాల పూదోట
- నాటి టెన్త్ క్లాస్ జ్ఞాపకాలు నేటి సిల్వర్ జూబ్లీ ముచ్చట్లు
- నాడు ఒకే బెంచి నేడు వేర్వేరు హోదాలు
- కన్నీళ్లు పేట్రేగిన ఆత్మీయ అలింగణాలు
- లంచ్ బాక్స్ ముచ్చట్లు క్లాస్ రూమ్ ఆటలు
- పాతికేళ్ల తర్వాత మళ్లీ గుర్తొచ్చిన వేళ
- నాడు అక్షరాలు నేర్పిన గురువులకు
- పాతికేళ్ల తర్వాత పాదాభివందనం చేసిన శిష్యులు

**జిన్నారం జూన్ 3 సిరి న్యూస్**

జిన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సిల్వర్



జూబ్లీ వేడుకలు,2000–2001 పదవ తరగతి పూర్తి చేసుకుని 25 సంవత్సరాలు (పాతికేళ్లు) పూర్తయిన సందర్భంగా నాటి బ్యాచ్ విద్యార్థులు మాదారం గ్రామ శివారులోని ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో రజతోత్సవ ఆత్మీయ సమ్మేళనాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అపురూప వేదిక పదవ తరగతి చదువు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయింది. గురువుల సమక్షం విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి మార్గదర్శనం చేసిన గురువులు ఒకవైపు,చిన్నప్పటి నుంచి ప్రతి అడుగులో తోడుగా ఉన్న బాల్య స్నేహితులు మరోవైపు ఒకే వేదికపై రావడం విశేషం, ఆనందాలతో ఉప్పొంగిపోయారు పూర్వ విద్యార్థులు.

**భావోద్వేగ పలకరింపులు:**

పదవ తరగతి ముగించుకుని పాతికేళ్లు గడిచిన తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులంతా ఒకే వేదిక పైకి రావడంతో ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఆనంద భాష్పాలతో భావోద్వేగానికి లోనయ్యారు. జ్ఞాపకాల వేదిక ఎన్నో ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులంతా ఒకే చోట కలవడంతో సమ్మేళన ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు పేరుపేరునా పిలుచుకుంటూ చిన్ననాటి ఆటలు పాటలు క్లాస్ రూమ్ అల్లరిని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు.

**కృతజ్ఞతా భావం**

తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గురువులను ఘనంగా సత్కరించి వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందారు. సాంస్కృతిక సందడి పాత రోజులను గుర్తు చేసేలా సాగిన ఆట పాటలు, గ్రూప్ ఫోటోలు, సెల్ఫీల హడావిడితో రోజంతా ఉల్లాసంగా గడిచిందని తెలిపారు.

**గురువందనం:**

పాతికేళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరడానికి కారణమైన నాటి గురువులను రిటైర్డ్ మరియు ప్రస్తుత ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి శాలువాలు, పూలమాలల తో జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరమాత్ముడి కృప అందరి పైన ఉండాలి



**పాపన్నపేట జూన్ 3 (సిరి న్యూస్):**

మండల పరిధిలో గల నాగసానిపల్లి గ్రామంలో శ్రీ ఉమా కేదారేశ్వర క్షేత్రం లో శ్రీ శ్రీ మాధవంద సరస్వతి స్వామి వారు బుధవారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెల జరిగే పూజా కార్యక్రమంలో స్వామివారు రావడం విశేషం. స్వామి వారు మాట్లాడుతూ పరమాత్ముడి నిత్యం పూజించడం వల్ల ప్రతి ఒక్కరి పైన ఆ పరమాత్ముడి కృప ఉంటుందని అన్నారు. ప్రతి ఇంటిలో నిత్యం పూజలు చేయడం జ్యోతి ప్రజ్వలన చేయడం వల్ల మనశ్శాంతిగా ఉంటుందని అలాగే అందరు కూడా పరమాత్ముడి సేవ చేసుకోవాలని అన్నారు. స్వామివారికి భూమయ్య స్టేట్ దంపతులు పాదపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ శర్మ శ్యాంసుందర్ శర్మ రామ్ శర్మ, కృష్ణమూర్తి సెట్, నరసింహులు గుప్తా, ఇంద్రసే నారెడ్డి, యాదన్న సైట్, భక్తులు పాల్గొన్నారు

## ప్రజా సేవకుడికి ఘన జన్మదిన వేడుకలు...

- ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో హరీష్ రావుకు శుభాకాంక్షల వెల్లువ



**రామచంద్రపురం, జూన్ 3 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, శాసనసభ ఉపనేత హరీష్ రావు జన్మది నోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన నాయకులు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపుతూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. మంత్రిగా పనిచేసిన కాలంలో సాగునీరు, తాగునీరు, వైద్యం, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్న హరీష్ రావు మరింత ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామ చంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, మహిళా విభాగం నాయకులు, డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని హరీష్ రావు సేవలను కొనియాడారు.

## ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

**ఆలయంలో ప్రత్యేక పూజలు.. అనాథాశ్రమంలో పుస్తకాల పంపిణీ**



**రామచంద్రపురం, జూన్ 3 (సిరి న్యూస్):**

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించి హరీష్ రావు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ప్రార్థించారు. అనంతరం స్థానిక అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.తదనంతరం బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొని హరీష్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి దశలో హరీష్ రావు విశిష్ట పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, రైతు సంక్షేమం, సంక్షేమ పథకాల అమలులో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మద్దూరి శ్రీకాంత్ రెడ్డి, నర్సింహ, కావలి శ్రీరాములు, బల్ల నర్సింగ్‌రావు, క్రాంతి, జైపాల్, గడ్డం కుమార్, రాములు యాదవ్, అప్పల భాస్కర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాజెక్టు జలకల



**పాపన్నపేట్ జూన్ 3 (సిరి న్యూస్) :**

పాపన్నపేట మండల పరిధిలో గల వనదుర్గ ప్రాజెక్ట్ (ఘనాపూర్ ప్రాజెక్ట్) జలకలను సంతరించుకుంది ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్ పూర్తిగా నిండుకుండల మారింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో గల ఈ ప్రాజెక్టు సింగూరు ప్రాజెక్టు తర్వాత అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుగాంచింది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాల సాగు నీటిని అందించనుంది. ఈ ప్రాజెక్ట్ సుమారు ఒక టీఎంసీ నీటి నిలువ సామర్థ్యంతో ఉండే ప్రాజెక్ట్. వ్యవసాయా భూములకు పెద్ద ప్రాజెక్టుగా రైతులు పిలుస్తారు. ఈ ప్రాజెక్ట్ నీటి నిలువ తో ఉండడం రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రామచంద్రపురంలో డ్రైనేజీ దుస్థితి..

- ప్రజారోగ్యంపై ముప్పు
- వర్షా కాలానికి ముందే చర్యలు కోరిన ఐలేష్

**రామచంద్రపురం, జూన్ 3 (సిరి న్యూస్):**



రామచంద్రపురం పట్టణంలో నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, తాగునీటి కాలుష్యం, భూగర్భ జలాల కలుషితంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జీహెచ్ఎంసీ వార్డు కమిటీ సభ్యుడు, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అమీన్పూర్–రామ చంద్రపురం డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం 268, భారతి నగర్ 269 డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నందున ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రైనేజీ లైన్లలో ఏర్పడిన సమస్యల కారణంగా మురుగునీరు మంచినీటి పైపులైన్లలోకి చేరి తాగునీరు, బోరుబావుల నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అదే విధంగా అనేక ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ కవర్లు ధ్వంసమై ప్రజలకు ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.దెబ్బతిన్న డ్రైనేజీ లైన్లను పునరుద్ధరించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీ, మంచినీటి సరఫరా పైపులైన్లు ఏర్పాటు చేయాలని, ధ్వంసమైన మ్యాన్‌హోల్ కవర్లను వెంటనే మార్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.దీనిపై స్పందించిన డిప్యూటీ జనరల్ మేనేజర్ త్వరలోనే సంబంధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఐలేష్ తెలిపారు.రామచంద్రపురం ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# హరీష్ రావు జన్మదిన వేడుకలు

**పాపన్నపేట్ జూన్ 3 (సిరి న్యూస్) :**

మాజీ మంత్రి, భారాస సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కంటారెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద ఆయన కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంటారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కన్నీరు ఎక్కడ ఉంటే తన్నీరు అక్కడ ఉండి ప్రజల కన్నీరు తుడుస్తారని భారాస



నియోజక వర్గ ఇన్ ఛార్జ్ కంటా రెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. తెలంగాణలో హరీష్ రావు ఓ బ్రాండ్ అని కొనియాడారు. హరీష్ రావు సూచనల మేరకు నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. కెసిఆర్ నాయకత్వంలో హరీష్ రావు ఉద్యమ ఒక కెరటంగా తెలంగాణ సాధనలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో హరీష్ రావు పాత్ర వెలకట్టలేనిది అన్నారు.నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల కోసం పాటుపడే ఉన్నత వ్యక్తిత్వం గల వ్యక్తి హరీష్ రావు అని కొనియాడారు. హరీష్ రావు సంపూర్ణ ఆరోగ్య అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శనం చేయాలని అమ్మవారిని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారాస నాయకులు సోములు, బాలాగౌడ్, గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్ , లింగా రెడ్డి, సర్పంచులు సురేష్, గంట రాణి సుధీర్, నాయకులు సంగ పవిత్ర దుర్గయ్య, సంజీవరెడ్డి, కాశీనాథ్ రావు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్ , జగదీష్ చారి, కిరణ్ గౌడ్, నవీన్, సాయి , దినేష్ గౌడ్

# ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ మహిపాల్ రెడ్డి**

**గుమ్మడిదల, జూన్ 3( సిరి న్యూస్):**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రామ్‌రెడ్డి బావి గ్రామ సర్పంచ్ సామల మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం గుమ్మడిదల మండల పరిధిలోని రామ్‌రెడ్డి బావి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొన సాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పథకం ద్వారా కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పనుల్లో పాల్గొంటున్న కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ



కార్యక్రమంలో ఉప సర్పంచ్ జహీందర్ రెడ్డి, వార్డు సభ్యులు అభిలాష్ గౌడ్, కృష్ణ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పద్మ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి, హరివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు జన్మదిన వేడుకలు

- చిత్రపటానికి పాలాభిషేకం
- వీరాభిమాని బుల్లెట్ రాజు

**నర్సాపూర్ జూన్ 03, (సిరి న్యూస్)**

ట్రబుల్ షూటర్ మాజీ మంత్రి టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీష్ రావు జన్మదిన సందర్భంగా బుధవారం నర్సాపూర్ పట్టణ చౌరస్తాలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హరీష్ రావు వీర అభిమాని నర్సాపూర్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ బుల్లెట్ రాజు ఆధ్వర్యంలో హరీష్ రావు భారీ చిత్ర పటానికి పూలమాలవేసి పలాభిషేకం చేశారు అనంతరం హైదరాబాద్– మెదక్ జాతీయ రహదారిపై బాణాసంచా పేల్చి కూడలి వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుల్లెట్ రాజు మాట్లాడుతూ హరీష్ రావు తెలంగాణ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల సమస్యలను తీర్చడం ప్రజాసేవలో ముందుండే నాయకుడు ప్రత్యర్థులకు సింహస్వప్నంగా ప్రత్యర్థి గుండెలలో ఉంటారని తెలంగాణ




అభివృద్ధిలో తన వంతు కృషి చేశారని నికార్సైన ప్రజా సేవకుడు మా హరీష్ అన్న అని భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, తెలంగాణ ప్రజలకు మరిన్ని సేవలు



అందించే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు ఇంచార్జ్ నాగరాజు గౌడ్, రింగుల ప్రసాద్ నర్సాపూర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనంమెచ్చిన నాయకుడు హరిశన్న

**ఝరాసంఘం, జూన్ 3(సిరిన్యూస్)**



హరిశన్న అని ప్రేమతో పిలవగానే మీకు నేనున్నానని భరోసా కలిగించి,ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొని అలవోకగా సమాధానం చెప్పగల దమ్మున్న తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ తన్నీర్ హరీష్ రావు జన్మదిన వేడుకలు MLA కొణింటి మాణిక్ రావు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భౌగోళిక స్వరూపాన్ని నరనరాలలో ఇంకించుకున్న జనప్రియ నేత పేదలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వింటూ సత్వరమే న్యాయం అందించ గల నాయకుడుT హరిశరావు .ఆయన సేవలు ప్రజలకు ఎంతో అవసరం అందుకే మరింత ప్రజాసేవకు అంకితం కావాలని భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించి పేద ప్రజలకు సేవ చేయాలని,నిండునూరేళ్ళు ఆయురారోగ్య సుఖసంతోషాలతో తులతుగాలని శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో MLA మాణిక్ రావు ప్రత్యేకంగా పూజాకార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ మండల అధ్యక్షులు వెంకటేశం,జహీరాబాద్ బి ఆర్ యస్ అధ్యక్షులు తట్టు నారాయణ,మాజీ మండల సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు జగదీశ్వర్ పాటిల్,కేతకి సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్,EX MPP సంగమేశ్వర్ పాటిల్, బోరేగావ్ సర్పంచ్ నాగేందర్ పాటిల్,ఈదులపల్లి సర్పంచ్ నాగేశ్వర్ పాటిల్, కంబాలపల్లి సర్పంచ్ రాజు చిలమమిడి సర్పంచ్ జయరాజ్ ,కొల్లూర్ బి ఆర్ స్ నాయకులు బస్వరాజ్ పాటిల్, రాజకుమార్, వీరన్నపాటిల్, బాలరాజ్,నర్సాపూర్ Ex సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఈదులపల్లి Ex సర్పంచ్ బస్వరాజ్, సర్పంచ్,శివమణి, ఎజాజ్ బాబా మరియు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# రామాయంపేటలో ఘనంగా మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలు..

• ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ.

**రామాయంపేట, జూన్ 3 (సిరి న్యూస్)**



రామాయంపేటలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. బుధవారం నాడు స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు రామాయంపేట పరిసర ప్రాంతాల నుండి పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ కార్యాలయం వద్ద నాయకులు భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు నినాదాలతో కార్యాలయ ప్రాంగణాన్ని హోరెత్తించారు.ఈ వేడుకల అనంతరం నాయకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, వారికి పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో, ముఖ్యంగా నీటి పారుదల ప్రాజెక్టులు, వైద్య రంగం మరియు మౌలిక వసతుల కల్పనలో హరీష్‌రావు పోషించిన పాత్ర చిర స్మరణీయమని కొనియాడారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామి అవుతూ, నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్న నాయకుడని, రాబోయే తెలంగాణకు హరీష్ రావు దిక్సూచి అవుతారని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు మరింత ముందుకు సాగాలని, ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సేవలు అందించాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, సొసైటీ చైర్మన్ భాదే చంద్రం, కౌన్సిలర్ చౌదరి చరిత, కొక్కు ప్రవీణ్, పార్టీ ప్రముఖ నాయకులు చౌదరి సుప్రభాతరావు,మద్దెల రమేష్. ఉమామహేశ్వర్,ఎస్కే అహ్మద్ దోమకొండ యాదగిరి, హస్నుద్దీన్, నవీన్. కృష్ణ గౌడ్. దోమకొండ శ్రీను. నవాత్ మహేష్. గుడాల లింగం. మర్కు గంగారం. బసన్నపల్లి రాజు యాదవ్ తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గ్రామ సభలను సమర్ధవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ జూన్,03(సిరిన్యూస్)**





ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు,మున్సిపాలిటీలో గ్రామ,వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ కార్యాలయం నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు.సీజన్ కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా,విద్యుత్,విద్య, ప్రణాళిక,తదితర శాఖల అధికారులతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంఈవోలు,తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో భారీ సైకిల్ ర్యాలీ. పచ్చదనం-పరిశుభ్రత పాటించాలి.

**రామాయంపేట, జూన్ 3 (సిరి న్యూస్)**




రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో ను, భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం నాడు ప్రపంచ సైకిల్ దినోత్సవం కూడా ఉన్నందున అధికారులు రెండు ప్రాంతాల్లో నిర్వహించినభారీ సైకిల్ ర్యాలీ అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా అటవీ కాంప్లెక్స్, మెదక్ నుండి ప్రారంభమైన ఈ భారీ సైకిల్ ర్యాలీ రాందాస్ చౌరస్తా మీదుగా రేంజ్ కాంప్లెక్స్, మెదక్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీని జిల్లా అటవీశాఖాధికారి (DFO) జేజీ పచ్చజెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు. జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో అటవీ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సిబ్బందితో పాటు, ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడటం మెదక్ జిల్లాలోని ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యం అంటూ నినాదాలు చేశారు. పచ్చదనాన్ని పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారానే మనం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమని అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ భారీ సైకిల్ ర్యాలీలో మెదక్, కొడిపల్లి, పెద్ద శంకరంపేట్, తూప్రాన్ రేంజ్‌లకు చెందిన అటవీ శాఖ సిబ్బంది మరియు ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు మెదక్ రేంజ్ అధికారి గణేష్ తెలిపారు.అలాగే రామాయంపేట పట్టణంలో కూడా అటవీ శాఖ రేంజర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా తమ సిబ్బందితో కలిసి, పట్టణంలోని వివేకానంద విద్యా విద్యార్థుల తో పాటు పలువురు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నట్లు రేంజర్ విద్యాసాగర్ తెలిపారు.

# జనసేన లోకి గడల అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేరిక

**హైదరాబాద్ సిరి న్యూస్:**



తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మాజీ డైరెక్టర్, డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి నివాసంలో జరిగిన కార్యక్రమంలో గడల శ్రీనివాసరావు గారికి పవన్ కళ్యాణ్ గారు పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ, డాక్టర్ గడల శ్రీనివాసరావు కుటుంబంతో తమ కుటుంబానికి ఎంతో కాలంగా సన్నిహిత అనుబంధం ఉందన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, నిజాయతీ, పరిపాలనా దక్షత కలిగిన అధికారిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రజల్లో విశేష గౌరవం సంపాదించుకున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ వైద్యుడిగా ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ స్థాయికి చేరుకోవడం ఆయన కృషి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ గడల శ్రీనివాసరావు వంటి అనుభవజ్ఞులు, సేవాభావం కలిగిన వ్యక్తులు జనసేనలో చేరడం పార్టీకి మరింత బలాన్ని, విశ్వసనీయతను తీసుకువస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనా అనుభవం, సమాజంలోని వివిధ వర్గాలతో ఆయనకు ఉన్న అనుబంధం తెలంగాణలో పార్టీ విస్తరణకు దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని రాజకీయాల్లోకి వస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావును హృదయపూర్వకంగా జనసేన కుటుంబంలోకి ఆహ్వానిస్తూ, తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీ పవన్ కళ్యాణ్ గారితో తన అనుబంధం మెగాస్టార్ శ్రీ చిరంజీవి గారి ద్వారా ప్రారంభమైందని తెలిపారు. కాలక్రమేణా పవన్ కళ్యాణ్ గారి వ్యక్తిత్వం, నిజాయతీ, ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధత తనను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు.తాను జనసేనలో చేరడం భావోద్వేగపూరిత నిర్ణయం కాదని, సమాజానికి మరింత విస్తృత స్థాయిలో సేవ చేయాలనే సంకల్పంతో తీసుకున్న ఆలోచిత నిర్ణయమని స్పష్టం చేశారు. యువతకు ఆశయాలను, దిశానిర్దేశాన్ని అందించే నాయకత్వం పవన్ కళ్యాణ్ గారిలో కనిపించిందని అన్నారు.ప్రస్తుత తరానికి విలువలతో కూడిన రాజకీయాలు అవసరమని, ఆ లక్ష్యంతో పనిచేస్తున్న జనసేన పార్టీ తనకు సరైన వేదికగా భావించానని తెలిపారు. ఇకపై జనసైనికుడిగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, తెలంగాణలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని, ప్రభుత్వ సేవలో ఉన్నప్పుడు ఎలా అంకిత భావంతో పనిచేశానో, ఇకపై ప్రజా జీవితంలో కూడా అదే నిబద్ధత, చిత్తశుద్ధితో ముందుకు సాగుతానని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా వైద్య ఆరోగ్య రంగానికి చెందిన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ప్రజారోగ్య కార్యకర్తలు, యువత, మహిళలు, మేధావులు మరియు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రభుత్వ సేవా కాలంలో అందించిన ప్రేమాభిమానాలు, ప్రోత్సాహం, సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. అలాగే కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో తనతో కలిసి పనిచేసిన మీడియా మిత్రులు, జర్నలిస్టులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం చేపట్టే తన భవిష్యత్ కార్యక్రమాలకు కూడా ఇదే సానుకూల సహకారం, ఆదరణ అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజ అభ్యున్నతి, యువత సాధికారత, మహిళల పురోగతి, ప్రజారోగ్య పరిరక్షణ మరియు ప్రజా సంక్షేమమే తన రాజకీయ ప్రయాణానికి ప్రధాన లక్ష్యాలని, ప్రజల ఆశీస్సులు, సహకారం తనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

• మరమ్మత్తుల పనుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం

**గుమ్మడిదల, జూన్ 3( సిరి న్యూస్ ):**

132/33 కేవీ సబ్‌స్టేషన్లలో చేపట్టనున్న మరమ్మత్తుల పనుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుమ్మడిదల విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ తెలిపారు. గుమ్మడిదల, జిన్నారం, బొంతపల్లి, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, సోలార్ పరిశ్రమ, గడ్డపోతారం ఎస్ఎస్-1, గడ్డపోతారం ఎస్ఎస్-2 సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిన్నారం మండల పరిధిలోని ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ ప్రకటనలో బొంతపల్లి ఏఈ రవీందర్, జిన్నారం ఏఈ తుకారాం పాల్గొన్నారు.

# మెదక్ ప్లాంట్ లో ప్రథమ చికిత్స పైన అవగాహన సదస్సు.



**సదాశివపేట. జూన్ 3. (సిరిన్యూస్)**

వాలంటీర్స్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ లో భాగంగా మూడవరోజు ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్లో మెడికల్ ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పీహెచ్ సీ ఆత్మకూరు నుండి డాక్టర్ సల్మా ఖాతున్ మెడికల్ ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కల్పిస్తూ సిపిఆర్ గురించి వాలంటీర్స్ అందరూ డెమో చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బిక్షపతి ఎంఆర్ఎఫ్ తరపున పట్నాయక్, పటేల్ , ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది. వాలంటీర్స్ అందరూ సివిల్ డిఫెన్స్ వారియర్ వెబ్సైట్లో రిజిస్టర్ చేసుకోవడం జరిగింది. వాలంటీర్స్ అందరూ భవిష్యత్తులో జరగబోయే విపత్తులను ఎదుర్కోవడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈరోజుతో ఈ సివిల్ డిఫెన్స్ వాలంటరీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ సక్సెస్ ఫుల్ గా ముగించడం జరిగింది.

# నిడమనూరు మండల నూతన కార్యవర్గం

**నల్గొండ సిరి న్యూస్ జూన్ 3:**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యు డబ్ల్యూ జే – ఐ జె యూ ) నిడమనూరు మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి బుదవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ లో నిర్వహించిన జిల్లా మహాసభలో ప్రకటించారు. మహాసభల్లో బాగంగా బుదవారం మండల యూనియన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కూన్ రెడ్డి బాలకోటి రెడ్డి( తొలిసాక్షి), ప్రధాన కార్యదర్శిగా బత్తుల సూరయ్య(వార్త), ఉపాధ్యక్షుడుగా ఉమ్మడి వెంకటరెడ్డి(ప్రజాజ్యోతి), కోశాధికారిగా జువ్విరాజు ( మన తెలంగాణ) కార్యవర్గ సభ్యుడుగా కంచర్ల రవీందర్ రెడ్డి (ది సౌత్ ఇండియా టైమ్స్) లను ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి స్టేజీపై ప్రకటించారు.

# ఆర్ డి ఓ సమీక్ష సమావేశం

**తూప్రాన్ జూన్ 3 సిరి న్యూస్**



తూప్రాన్ రెవిన్యూ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం మేడ్చల్ ముద్దేడ్ 221.06 కిలో మీటర్ల మధ్య రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులపై రైల్వే అధికారుల తోఆర్ డి ఓ జయ చంద్రా రెడ్డి రైల్వే అధికారులు తహసీల్దార్ లు కలిసి మేడ్చల్ ముద్ఖేడ్ రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆర్ డి ఓ మాట్లాడుతూ, గతంలో ఈ ప్రాజెక్టు కోసం 2 ఎకరాల 6 గుంటల భూమి ఇచ్చామని భూ సేకరణ కూడా పూర్తయ్యిందని, ప్రస్తుతం అదనంగా 7 ఎకరాల భూమి అవసరమని రైల్వే శాఖ నుంచి రిక్విజిషన్ అందిందన్నారు. ఈ భూ సేకరణ ప్రక్రియను కూడా తొందరలోనే పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేశారు ఇప్పటికే రైల్వే డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే రైళ్ల వేగం రైళ్ల సంఖ్య పెరగడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఆయన తెలిపారు ఈ సమావేశంలో ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి తూప్రాన్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి రైల్వే కన్సల్టెంట్ రమేష్ తో పాటు రైల్వే అధికారులు సీనియర్ అసిస్టెంట్ నాగరాజు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# తూప్రాన్ లో ఘనంగా మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలు

**తూప్రాన్ జూన్ 3 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణంలో బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన కార్యక్రమాన్ని తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని రవీందర్ గౌడ్ , ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు జన్మదిన వేడుకలుఘనంగా నిర్వహించారు హరీష్ రావు జన్మదినం పురస్కరించుకొని తూప్రాన్ లో ఏర్పాటుచేసిన వేడుకలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని సబ్బండ వర్గాలతో ఉధృతం చేసిన ఘనత హరీష్ రావుదే అని తెలంగాణ సాధించిన తరవాత 9 ఏళ్ళు మంత్రి గా ఉండి కాళేశ్వరం. మిషన్ కాకతీయ చెరువుల అభివృద్ధి చేశాడని ఆయన తెలిపారు మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన డైనమిక్ యంగ్ లీడర్ డబుల్ షూటర్ హరీష్ రావు 54వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు హరీష్ రావు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ లో హరీష్ రావ్ ఒక ఫైర్ బ్రాండ్

- "కన్నీరు ఎక్కడ ఉంటే తన్నీరు అక్కడ ఉంటారు" –
- బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి
- ఏడుపాయల సాక్షిగా అట్టహాసంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు
- ప్రత్యేక పూజలు.. కేక్ కటింగ్.. భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు



**మెదక్ ప్రతినిధి,జూన్3(సిరి న్యూస్ )**

మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో అట్టహాసంగా జరిగాయి. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఏడుపాయల అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జన్మదిన వేడుకల సందర్భంగా ముందుగా ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, తెలంగాణ అభివృద్ధి, హరీష్ రావు ఆయురారోగ్యాల కోసం అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన కంటారెడ్డి తిరుపతిరెడ్డి, హరీష్ రావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడని కొనియాడారు. "కన్నీరు ఎక్కడ ఉంటే తన్నీరు అక్కడ ఉంటారు" అనే మాటకు అర్థం చెప్పే విధంగా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచే నాయకుడు హరీష్ రావు అని అన్నారు.తెలంగాణ రాజకీయాల్లో హరీష్ రావు ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని, ఆయన పేరు నమ్మకం, సేవ, అభివృద్ధికి ప్రతీకగా మారిందని పేర్కొన్నారు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడిగా హరీష్ రావు నిలిచారని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో హరీష్ రావు ఒక కెరటంలా పనిచేశారని గుర్తు చేశారు. ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి తెలంగాణ ఆకాంక్షను తీసుకెళ్లి ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

### మెదక్ అభివృద్ధికి మార్గదర్శి

మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో హరీష్ రావు చేసిన సేవలు వెలకట్టలేనివని కంటారెడ్డి తెలిపారు. సాగునీరు, మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన అందించిన సహకారం చిరస్మరణీయమని కొనియాడారు.అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే ఉన్నత వ్యక్తిత్వం కలిగిన నాయకుడు హరీష్ రావు అని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం యువతకు ఆదర్శమని అన్నారు.హరీష్ రావు సూచనలు, మార్గదర్శకత్వంలో మెదక్ నియోజకవర్గాన్ని మళ్లీ బీఆర్ఎస్ కంచుకోటగా తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తాయని కంటారెడ్డి తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలి హరీష్ రావు సంపూర్ణ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించి తెలంగాణ అభివృద్ధికి మరింత మార్గదర్శనం చేయాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోములు, బాలాగౌడ్, గురుమూర్తి గౌడ్, శ్రీనాథ్, లింగా రెడ్డి, సర్పంచులు సురేష్, గంట రాణి–సుధీర్, సంగ పవిత్ర దుర్గయ్య, కాశీనాథ్ రావు, శ్రీనివాస్, కొండల్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, జగదీష్ చారి, కిరణ్ గౌడ్, గంజి నవీన్, సాయి, దినేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నినాదాల మధ్య హరీష్‌రావు జన్మదిన వేడుకలు

- మండల కేంద్రంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు
- వేడుకలకు దూరంగా మహిళా కౌన్సిలర్లు, సర్పంచులు

**గుమ్మడిదల, జూన్ 3( సిరి న్యూస్):**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను గుమ్మడిదల మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి హరీష్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జై తెలంగాణ, హరీష్‌రావు జిందాబాద్ అంటూ నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది. హరీష్‌రావు తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజల మధ్య ఉంటూ పార్టీ బలోపేతానికి, రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, గ్రామ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జన్మదిన వేడుకలకు హాజరుకాని మహిళా కౌన్సిలర్లు, సర్పంచులు

తెలంగాణ ఉద్యమ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు జన్మ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం గుమ్మడిదలలో



నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా కౌన్సిలర్లు, మహిళా సర్పంచులు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైనప్పటికీ మహిళా ప్రజాప్రతినిధులు కనిపించలేదు. పార్టీ ముఖ్య నేత జన్మదిన వేడుకల్లో మహిళా కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొనకపోవడంపై కార్యకర్తల మధ్య స్వల్ప చర్చ సాగింది. అయితే వారు వ్యక్తిగత లేదా ఇతర కారణాలతో కార్యక్రమానికి హాజరు కాలేకపోయి ఉండవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.

# 108 సేవల మాదిరిగా హరీశ్ రావు సేవలు!

- సంగారెడ్డిలో ఘనంగా హరీశ్ రావు జన్మదిన వేడుకలు
- రక్తదాన శిబిరం, ఆసుపత్రిలో పండ్ల పంపిణీ, అన్నదానం
- ప్రజా సమస్యలపై స్పందించే గొప్ప నాయకుడు హరీశ్ రావు
- పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే చింత

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు సేవలు 108 అంబులెన్స్ సేవల్లాంటివని సంగారెడ్డి



ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కొనియాడారు. హరీశ్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని సదాశివపేటతో పాటు సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించే సమర్థవంతమైన నాయకుడు హరీశ్ రావు అని ప్రశంసించారు. ఆయన పనితీరును మాజీ సీఎం కేసీఆర్ సైతం ఎంతో మెచ్చుకునే వారని గుర్తుచేశారు. హరీశ్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ, మరెన్నో ఏళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, చింత సాయినాథ్, వేణుగోపాలస్వామి, సునీల్ జై, పలువురు కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పచ్చని ప్రకృతి ఒడిలో యోగా సాధన

- ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్య పాఠశాలకు రండి
- ఆరోగ్యానికి యువత కొత్త బాట
- ఆరోగ్య పాఠశాల వైపు ఒక అడుగు వేయండి అంటూ చైతన్యం

**గుమ్మడిదల, జూన్ 3 (సిరి న్యూస్ ):**

ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యల మధ్య ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న తరుణంలో గ్రామీణ యువత యోగా సాధన వైపు అడుగులు వేస్తోంది. పచ్చని పంట పొలాల మధ్య స్వచ్ఛమైన వాతావరణంలో యోగాసనాలు చేస్తూ ఆరోగ్యకర జీవన విధానానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సాధారణంగా పంట పొలాల మధ్య లభించే స్వచ్ఛమైన గాలి శరీరానికి నూతన ఉత్సాహాన్ని అందించడంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. అలాంటి ప్రకృతి వాతావరణంలో యోగా సాధన చేయడం వల్ల శరీర దారుఢ్యం పెరగడంతో పాటు మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. యోగ గురువు సరెడ్డి గారి బిక్షపతి రెడ్డి ఆధ్వర్యంలో వివేకానంద స్వచ్ఛంద సేవా సమితి నేతృత్వంలో ఆరోగ్య పాఠశాల పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ప్రతిరోజూ ఉదయం పూట పంట పొలాల మధ్య చేరి వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కృషి చేస్తున్నారు.

### ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యం వైపు ఒక అడుగు వేయండి

ఆరోగ్య పాఠశాలకు రండి అనే సందేశంతో గ్రామ ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివేకానంద స్వచ్ఛంద సేవా సమితి యోగ గురువు సరెడ్డిగారి బిక్షపతి రెడ్డి తెలిపారు. ప్రతిరోజు ఉదయం గంట సమయం యోగాకు ప్రతి ఒక్కరు సమయం కేటాయించాలని కోరారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే జీవన విధానమని వారు చెబుతున్నారు.నిత్య యోగా సాధన వల్ల



రక్త ప్రసరణ మెరుగుపడటంతో పాటు శ్వాసకోశ వ్యవస్థ బలోపేతం అవుతుందని, ఒత్తిడి, ఆందోళన తగ్గి ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కొంత సమయాన్ని ఆరోగ్యానికి వెచ్చించడం ఎంతో అవసరమని సూచిస్తున్నారు. ప్రకృతి మధ్యలో నిర్వహిస్తున్న ఈ యోగా కార్యక్రమం గ్రామంలోని ఇతర యువతకు కూడా స్ఫూర్తిగా నిలుస్తోంది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక ఉత్తమ మార్గమని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని యువకులు పిలుపునిస్తున్నారు. పచ్చని ప్రకృతి ఒడిలో ఆరోగ్య సాధన చేస్తున్న ఈ యువత గ్రామంలో ఆరోగ్య చైతన్యానికి నాంది పలుకుతోంది.

# వైద్యశాఖలో ఉద్యోగాల వివాదం ముదురుతోంది..!

- నియామకాలపై పెరుగుతున్న అనుమానాలు
- నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీపై కలకలం
- ఎంపిక ప్రక్రియపై పారదర్శకత ఎక్కడ..?
- స్థానిక నిరుద్యోగులకు దక్కని అవకాశాలు
- బంధుప్రీతి, నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై చర్చ
- విజిలెన్స్ దర్యాప్తుకు పెరుగుతున్న డిమాండ్

**మెదక్ ప్రతినిధి:జూన్03(సిరి న్యూస్)**

మెదక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగాల భర్తీ వ్యవహారం రోజురోజుకు మరింత వివాదాస్పదంగా మారుతోంది. ఇప్పటికే నోటిఫికేషన్ లేకుండా పలు పోస్టులను భర్తీ చేశారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా, తాజాగా మరిన్ని అంశాలు వెలుగులోకి వస్తున్నాయన్న ప్రచారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ శాఖలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాల్సిన సమయంలో నియామకాలపై వరుసగా ఆరోపణలు రావడం ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది.ఉద్యోగాల భర్తీకి ముందు ఖాళీల వివరాలను ప్రకటించారా..? దరఖాస్తులు స్వీకరించారా..? అర్హుల జాబితా తయారు చేశారా..? ఎంపిక కమిటీ సమావేశాలు నిర్వహించారా..? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లేకపోవడం చర్చకు దారితీస్తోంది.

### ఉద్యోగాల కోసం ఎదురు చూసిన యువతలో ఆవేదన

ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే విషయం కూడా తెలియకుండా కొన్ని పోస్టులు భర్తీ కావడం వల్ల తమకు దరఖాస్తు చేసుకునే అవకాశమే లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి నియామక ప్రక్రియలో సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని, కానీ ఇక్కడ ఆ ప్రక్రియ కనిపించలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఖాళీలను అధికారికంగా ప్రకటించి ఉంటే మరెంతో మంది అర్హులైన స్థానిక అభ్యర్థులు పోటీపడే అవకాశం ఉండేదని చెబుతున్నారు.

### ఎన్‌హెచ్‌ఎం నియామకాలపై ప్రత్యేక దృష్టి

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో జరిగిన నియామకాలపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ విషయంలో ఎలాంటి ప్రకటన ఇవ్వకుండా ఎంపికలు నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది ఎంపికైన అభ్యర్థులు స్థానిక జోన్‌కు చెందని వారేనన్న ప్రచారం జరుగుతుండగా, స్థానికత నిబంధనలు పూర్తిగా పాటించారా లేదా అన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, ఆ నిబంధనలు ఎంతవరకు అమలయ్యాయో విచారణలో తేలాల్సి ఉంది.

### తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో నియామకాలపై సందేహాలు

తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో జరిగిన ఫార్మసిస్టు నియామకం చుట్టూ కూడా అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎంపికైన అభ్యర్థికి శాఖలో పనిచేసిన కొంతమందితో బంధుత్వ సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో బంధుప్రీతి అంశం మరోసారి తెరపైకి వచ్చింది.ఉద్యోగాల భర్తీలో అర్హతలు, మెరిట్, అనుభవం ఆధారంగా ఎంపిక జరగాల్సి ఉండగా వ్యక్తిగత సంబంధాలు ప్రభావం చూపాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డిఎంహెచ్ఓ కార్యాలయం పరిధిలో ఇప్పటికే కొంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొత్తగా కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అందుబాటులో ఉన్న సిబ్బందికి బాధ్యతలు అప్పగించకుండా కొత్త నియామకాలు చేపట్టడం వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనాన్ని సమర్థవంతంగా వినియోగించాల్సిన సమయంలో ఇలాంటి నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారో వెల్లడించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### క్షయ నియంత్రణ విభాగంలోనూ గందరగోళం

టిబి నియంత్రణ కార్యక్రమంలో జరిగిన నియామకాలపై కూడా ఆరోపణలు కొనసాగుతున్నాయి. ల్యాబ్ సూపర్వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అర్హతలు, అనుభవం, నియామక నిబంధనలు పూర్తిగా పాటించకుండా బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒక విభాగానికి చెందిన ఉద్యోగికి మరో విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

### వెయిటేజీ రాజకీయమా..?

కొన్ని కాంట్రాక్ట్ పోస్టుల ద్వారా ఉద్యోగులకు సేవా వెయిటేజీ లభించే అవకాశం ఉండటంతో ఈ నియామకాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో కూడా తాత్కాలిక ఉద్యోగాల ద్వారా వెయిటేజీ పొందిన కొందరు తర్వాత శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఉదాహరణలు ఉండటంతో ప్రస్తుతం జరిగిన నియామకాలపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. కొంత మ ందికి భవిష్యత్తులో ప్రయోజనం కలిగించేలా పోస్టులు కేటాయించారా అన్న అంశంపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఫైళ్లను పరిశీలిస్తేనే బయటపడే నిజాలు నియామకాలకు సంబంధించిన పూర్తి ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఖాళీల వివరాలు, దరఖాస్తుల సంఖ్య, ఎంపిక ప్రమాణాలు, ఇంటర్వ్యూ రికార్డులు, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, అర్హతల పరిశీలన వంటి అంశాలను సమగ్రంగా విచారించాలని కోరుతున్నారు.విచారణ జరిగితే మాత్రమే ఆరోపణల్లో వాస్తవం ఎంతుందో స్పష్టమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

### అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి..?

ఈ వ్యవహారంపై ఆరోపణలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు అధికారికంగా పూర్తి వివరణ వెలువడకపోవడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది.ఆరోపణలు నిరాధారమైతే వాటిని వెంటనే ఖండించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. అదే సమయంలో ఆరోపణల్లో నిజం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.విజిలెన్స్ విచారణకు డిమాండ్ పెరుగుతోంది సీపీఎం సహా పలు ప్రజా సంఘాలు, నిరుద్యోగ యువత ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా స్థాయి విచారణతో పాటు అవసరమైతే విజిలెన్స్ లేదా ఉన్నతస్థాయి కమిటీతో దర్యాప్తు జరిపించాలని కోరుతున్నారు.అన్ని నియామకాల రికార్డులను బహిర్గతం చేసి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.వైద్యశాఖలో నియామకాలపై వచ్చిన ఫిర్యాదులు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

### ఫిర్యాదులపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటుంది..?

ఆరోపణలపై సమగ్ర విచారణ జరుగుతుందా..? బాధ్యులపై చర్యలు ఉంటాయా..? అనే అంశాలపై నిరుద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.ప్రభుత్వ ఉద్యోగాలు కొందరికే పరిమితం కాకుండా ప్రతి అర్హ అభ్యర్థికి సమాన అవకాశం కల్పించాలన్న డిమాండ్ మధ్య, మెదక్ వైద్యశాఖ నియామకాల వ్యవహారం ఇప్పుడు జిల్లాలో పెద్ద చర్చగా మారింది.జిల్లా కలెక్టర్ చర్యలు ఏ విధంగా ఉంటాయోనని నిరుద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి..

- ఆదర్శ్ రెడ్డి చొరవతో క్షేత్రస్థాయి పరిశీలన
- సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులు

**రామచంద్రపురం, జూన్ 4 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు నియోజకవర్గంలోని భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్లలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిశీలించేందుకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పర్యటించారు. ఈ పర్యటనలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం మెయిన్ రోడ్, ఫెన్సింగ్ ఏరియా, బొంబాయి కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే భారతి నగర్ డివిజన్‌కు కొత్త గల్పర్ మెషీన్‌ను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఎల్ఐజీ కాలనీలో మంచినీరు, డ్రైనేజీ నీరు కలిసిపోతున్న సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ పర్యటనలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ శివ, నాయక్‌తో పాటు ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన

## శేరి గ్రామంలో బడిబాట కార్యక్రమం ప్రారంభం

**వెల్దుర్తి,జూన్ 03, (సిరి న్యూస్):**




వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామంలో బుధవారం నాడు బడిబాట కార్యక్రమం మండల విద్యాధికారి బుచ్చ నాయక్ ఆధ్వర్యంలో శేరి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోటుకి వెళ్లి గ్రామ సభ నిర్వహించి బడిబాట ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడము, ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపా ధ్యాయులు, నాణ్యమైన బోధన, విశాలమైన తరగతి గదులు, ప్రయోగ శాలలు, గ్రంథాలయం, క్రీడా సౌకర్యాలు, విద్యార్థుల ప్రతిభను వెలికితీసే అనేక కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను కూడా విద్యార్థులకు అందిస్తున్నాము. అందువల్ల గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని గ్రామస్తులను కోరారు. మన పిల్లల చదువే మన గ్రామ ప్రగతికి పునాది అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ప్రధాన ఉపాధ్యాయులు బి. సాంబయ్య తెలియజేశారు.ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజ నాలు విద్యార్థులకు అందుతున్నాయి. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ పాఠశాలల లక్ష్యంగా పనిచేస్తోంది అని మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు. కావున ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి కే. బుచ్చనాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ నవీన్ కుమార్ గ్రామంలోని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సిగ్నల్స్ మొరాయింపు.. వాహనదారులకు తిప్పలు

- అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యలపై ఆందోళన
- డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డికి వినతిపత్రం

**రామచంద్రపురం, జూన్ 4 (సిరి న్యూస్):**



తెల్లాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ ఎంఐజీకి వెళ్లే అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్స్ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారి, నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు మరింత ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ, సిగ్నల్ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డికి స్థానిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు లచ్చిరామ్ నాయక్, శంషాబాద్ రాజు, సీఎన్‌వీ బాలాజీ, బీజేపీ నాయకుడు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొని అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించాలని వారు కోరారు.

# పారిశ్రామికాభివృద్ధికి మరో మైలురాయి..

- తెరానిమ్ బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభించిన మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ...

**హత్నూర, జూన్ 3,(సిరి న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ఘట్టంగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల శివారులో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన తెరానిమ్ బయోలాజిక్స్ తయారీ యూనిట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారదర్శక విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో అందుబాటులో ఉండటంతో ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రగామిగా నిలిచిందని, తెరానిమ్ బయోలాజిక్స్ వంటి అత్యాధునిక సంస్థల రాకతో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

### స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు

ఈ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమల విస్తరణతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చైతన్యం పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. బయోలాజికల్ ఔషధాల తయారీలో కీలక కేంద్రంగా యూనిట్మం త్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక బయోలాజికల్ ఔషధాల తయారీలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ఇలాంటి సంస్థలు బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ఔషధ, బయోటెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. పరిశ్రమలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని సంస్థలకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. స్థానిక ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పరిశ్రమలు ముందుకు సాగాలని అన్నారు. ప్రముఖుల పాల్గొనడం ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ పాండు, సంస్థ ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యాపారీకరణ,కార్పొరేటికరణను వ్యతిరేకిద్దాం

**మెదక్ ప్రతినిధి,జూన్03(సిరి న్యూస్)**

విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈ నెల 5 నాడు సుందరయ్య భవనం నుండి ఇందిరా పార్క్ వరకు నిర్వహించే ధర్నా కార్యక్రమంను విజయవంతం చేయాలని మెదక్ జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆనందం అధ్యక్షులు యాదగిరి పిలుపునిచ్చారు బుధవారం స్థానిక టిపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందని బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం కేవలం 4 శాతానికి పరిమితం చేసి పేదలకు విద్యను దూరం చేస్తుందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహిణలో పూర్తిగా విఫలమైందని వెంటనే పేపర్ లీకేజీ బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కనీసం 10 శాతం నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం 20శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరు మీద రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే బదులు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్నటువంటి డైట్ లెక్చరర్ పోస్టులను, మండల విద్యాధికారి పోస్టులను మరియు జిల్లా విద్యాధికారి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఎస్సిఈఆర్టి లో ఖాళీగా ఉన్నటువంటి ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్ లను వెంటనే విడుదల చేయాలి.

# వర్షా లకు తడిస్తే రైతులకే నష్టం

- గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్
- తడిసిన ధాన్యం నాణ్యత దెబ్బతింటే రైతులకే భారీ నష్టం



**గుమ్మడిదల, జూన్ 3( సిరి న్యూస్):**

వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటే రైతులకే భారీ నష్టం వాటిల్లుతుందని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద్ రెడ్డితో కలిసి గుమ్మడిదలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు చేరిన వరి ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోతోందని, అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని అన్నారు. రైతులు ఎండనక వాననక కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి అక్కడే నిల్వ ఉండిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. స్థానికంగా అన్నపూర్ణ బాయిల్డ్ రైస్ మిల్లు అందుబాటులో ఉన్నప్పటికీ ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు కేటాయించడం వల్ల రవాణా సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. లారీల కొరత కారణంగా రైతులు గంటల తరబడి, కొన్ని సందర్భాల్లో రాత్రి వరకు టోల్‌గేట్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను పదేపదే తీసుకెళ్తున్నప్పటికీ ధాన్యం తరలింపు ప్రక్రియ వేగం అందుకోవడం లేదన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటే రైతులకే భారీ నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి తగినన్ని లారీలను సమకూర్చడంతో పాటు స్థానిక మిల్లులకు ధాన్యం కేటాయించి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతాంగంతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# కెసిఆర్ అడుగుజాడల్లో నడిచిన లీడర్ హరీష్ రావ్

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి
- మెదక్ లో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**మెదక్ ప్రతినిధి,జూన్3(సిరి న్యూస్)**

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అడుగుజాడల్లో నడిచిన లీడర్ హరీష్ రావ్ అని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.బుధవారం మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను మెదక్‌లో ని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### సాయి బాలాజీ గార్డెన్లో వేడుకలు

మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మా దేవేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని మెదక్ ఎంసీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రక్తం కొరతను దృష్టిలో పెట్టుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పద్మా దేవేందర్ రెడ్డి ప్రారంభించగా, న్యాయవాది జీవన్ రావుతో పాటు పలువురు యువకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అండగా నిలిచి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన నాయకుడు హరీష్ రావు అని కొనియాడారు. 2001 నుంచి తెలంగాణ సాధన కోసం జరిగిన ప్రతి పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇరిగేషన్, ఆర్థిక శాఖ మంత్రిగా హరీష్ రావు సమర్థవంతంగా పనిచేశారని చెప్పారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన పాత్ర విశేషమని, ఆర్థిక శాఖ మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేశారని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న హరీష్ రావు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సేవా దృక్పథం, అంకితభావం, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని మెదక్ రక్తనిధి ద్వారా అవసరమైన పేద రోగులకు అందుబాటులోఉంచనున్నట్లు తెలిపారు. దీనివల్ల రక్తం కొరత సమస్య కొంత మేర తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### దీర్ఘాయుష్షు తో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్ష

హరీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘకాలం ప్రజలకు సేవ చేయాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజల ఆశీస్సులు పొందాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బట్టి జగపతి, కృష్ణారెడ్డి, గంగా నరేందర్, మున్సిపల్ కౌన్సిలర్ దీపక్ కుమార్, బట్టి ఉదయ్ మాజీ కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.